క్లుప్తంగా

కూలీల సంఖ్య పెంచాలి



ధర్పల్లి: ఉపాధి హామీ కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఎంపీడీవో బాలకృష్ణ అన్నారు. కొటాల్‌పల్లి, సీతాయిపేట్ గ్రామంలో మంగళవారం ఆయన పల్లె ప్రకృతి వనం, నర్సరీలతో పాటు ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు మండిపోవడంతో నర్సరీలో మొక్కలు వాడిపోకుండా రోజుకు రెండుసార్లు నీళ్లు పట్టాలన్నారు. వర్షాకాలం ప్రారంభమయ్యే నాటికి మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలని పేర్కొన్నారు . ఉపాధి కూలీలు తమ పని దినాల కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీవో వినోద తదితరులు ఉన్నారు.

పశువులకు టీకాలు

ఇందల్వాయి: మండలంలోని వెంగల్‌పాడ్ గ్రామంలో సుమారు 800 పాడి పశువులకు మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు మండల పశు వైద్యాధికారి గంగప్రసాద్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని పశువులకు టీకాలు వేయనున్నట్లు, పశువుల పెంపకందారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది తిరుపతి, రాజు, సుజాత, పోశెట్టి ఉన్నారు.

వడదెబ్బపై అవగాహన

ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం ప్రజలకు వడదెబ్బపై ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. సరైన రక్షణ లేకుండా ఎండలో తిరగడం, సరైన మోతాదులో నీరు తాగకపోవడం మూలానా వడదెబ్బ వస్తుందని తెలిపారు. వడదెబ్బకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ఓఆర్ఎస్ పాకెట్లను అందజేశారు. హెచ్ఈవో శంకర్, సిబ్బంది అక్బర్ అలీ, సుభద్ర పాల్గొన్నారు.

మునిపల్లిలో పుస్తక పఠనం



జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పుస్తక పఠనం నిర్వహించారు. పుస్తకం చీకటిలో దారిచూపే దీపంగా ఉంటుందని, ప్రగతికి బాట వేస్తుందని, సమాజంలో తలెత్తుకునేలా చేస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఉపాధ్యాయురాలు గోదావరి, విద్యార్థులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఉపాధి హామీ పనుల్లో భాగంగా కూలీలకు పని ప్రదేశాల్లో టెంట్, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఇతరత్రా సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో లింగం నాయక్ సూచించారు. మండలంలోని గుడితండా చెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా చెరువుల్లో ఫిష్ ఫాండ్ పనులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు చేశారు. అలాగే ముదక్‌పల్లి చెరువులో ఫిష్ ఫాండ్‌కు మార్క్ అవుట్ చేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ఎక్కువ సంఖ్యలో కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా చూడాలని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో పని ప్రదేశాల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేయాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతిరోజూ 150 మందికి తగ్గకుండా కూలీలు హాజరయ్యేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈసీలు, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రెంజల్(బోధన్): బాగేపల్లిలో సీతారామ, హన్మాన్ ఆలయాల్లో గ్రామస్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. వేద బ్రహ్మణులు ఆలయాల్లో హోమం, యజ్ఞం నిర్వహించారు. గ్రా మంలో నూతన ఆలయ నిర్మాణం చేపట్టి మండల ం రోజులు పూర్తవడంతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన ం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పూ జలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సాయాగౌడ్, గోపాల్, దాత సాయిబాబా గౌడ్ తదితరులున్నారు.

రూ.40 కోట్ల పన్ను వసూలు

- గతేడాది కంటే రూ.7 కోట్లు అధికం
- కార్పొరేషన్ సిబ్బంది విశేష కృషి



నిజామాబాద్‌నాగారం: నగర మున్సిపల్ కార్పొరేషన్‌కు ఈ ఆర్థిక సంవత్సరం రూ. 40కోట్ల వరకు ఆస్తి పన్ను వచ్చింది. గతంలో ఎప్పుడు లేనివిధంగా ఈ ఏడాది అధికారులు, ఉద్యోగులు ప్రత్యేక కార్యచరణతో పన్ను వసూళ్లు చేపట్టగా, గతంలోకంటే అధికంగా వసూలు చేశారు. అలాగే మార్చి 1 నుంచి 31వరకు ఉదయం నుంచి రాత్రి వరకు పన్ను వసూళ్ల కోసం స్పెషల్‌డ్రైవ్ సైతం నిర్వహించారు. బకాయిల విషయంలో రాజీ పడకుండా సీజ్ చేయడంతో ఈసారి పెద్ద ఎత్తున పన్నులు వసూళ్లు అయ్యాయి.

గత ఏడాది రూ.33 కోట్లే..

నగరంలో 60 డివిజన్లు, 83,150 నివాసాలున్నాయి. అయితే 62,900 ఇళ్లకు సంబంధించి ఆస్తి పన్ను రూ. 40కోట్ల వరకు వచ్చింది. ఆస్తి పన్ను వసూళ్లకు గాను ఆర్ఐ–08మంది, బిల్ కలెక్టర్లు–27, వీఆర్ఏలు–10, అసిస్టెంట్‌లు–15లు విశేషంగా శ్రమించారు. ఆర్వో, డిప్యూటీ కమిషనర్, ఇతర ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఆస్తి పన్నులు రాబట్టారు. నెల రోజులపాటు నిరంతరంగా శ్రమించడంతోనే రూ. 40కోట్ల వరకు వచ్చింది. గత ఏడాది కేవలం రూ. 33కోట్లు మాత్రమే వచ్చింది. ఈ సంవత్సరం అదనంగా రూ. 7కోట్ల వరకు రావడం విశేషం.

పన్ను చెల్లించని 20వేల మంది..

నగరంలో ఇంకా 20వేల 250మంది ఇళ్లకు సంబంధించి ఆస్తి పన్ను రావాల్సి ఉంది. అధికారులు, ఉద్యోగులు ఇంటింటికి తిరిగినా కొంతమంది ఆస్తి పన్నులు చెల్లించడంలో మొండికేశారు. ప్రతి ఏడాది ఆస్తి పన్నులు చెల్లించాల్సి ఉన్నా, కొంతమంది కోర్టుకు వెళ్లడంతో పన్నులు వసూళ్లు కాలేదు. మరో రూ. 7కోట్ల వరకు ఆస్తి పన్ను రావాల్సి ఉన్నా.. 20వేల ఇళ్లకు సంబంధించి ఆస్తి పన్ను రాకపోవడంతో రూ. 40కోట్ల వరకు రాబట్టారు.

5శాతం రిబేట్‌తో మరో అవకాశం

కొత్త, పాత ఆస్తి పన్నులు చెల్లించేవారికి ప్రభుత్వం 5శాతం రిబేట్ అవకాశం ఇచ్చింది. 2024 మార్చి 31వరకు ఆస్తి పన్నులు చెల్లించిన వారందరికి వెసులుబాటు ఉంటుంది. ఈ నెల 1నుంచి 30వరకు అవకాశం ఇచ్చింది. గత ఏడాది చెల్లించి, ఈ ఏడాది చెల్లించకుంటే నెలకు 2శాతం చొప్పున పెనాల్టీతో ఆస్తి పన్నులు చెల్లించవచ్చు. గత నెల వరకు బకాయిల ఆస్తి పన్నుపై ఉన్న వడ్డీకి 90శాతం మాఫీ ఈనెల నుంచి లేదు. ఎవరైనా ఆస్తి పన్ను బకాయిలు ఉంటే రెట్టింపుతో పన్నులు చెల్లించాల్సి ఉంటుంది.

అదనంగా చెల్లిస్తే 5శాతం రిబేట్

ఈ ఏడాది మార్చి 31వరకు ఆస్తి పన్నులు చెల్లించిన వారు ఎవరైనా సరే పన్నులు అదనంగా చెల్లిస్తే 5శాతం రిబేట్ ఉంటుంది. దీనిని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. బకాయిలు, కోర్టులకు వెళ్లడంతో రూ. 40కోట్ల వరకు వసూళ్లు చేశాం. లేకుంటే మరో రూ. 7కోట్ల వరకు ఆస్తి పన్ను వచ్చేది. అయినా ఈ నెలలో మరింత రాబట్టడానికి కృషి చేస్తాం.

–రాజేంద్రకుమార్, డిప్యూటీ కమిషనర్

సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళి





పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు.. కల్లుగీత సంఘం నాయకులు

సుభాష్‌నగర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా మంగళవారం వినాయక్‌నగర్‌లోని అయన విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యాధికారం కోసం పాపన్న గౌడ్ పోరాటం చేశారని గుర్తుచేశారు. పాపన్న గౌడ్ స్ఫూర్తితో, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం బీసీలు, బడుగు, బలహీనవర్గాలకు సంక్షేమ ఫలాలను అందిస్తుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి బీజేపీని గెలిపించాలన్నారు. నాయకులు గిరిబాబు, సురేష్, నందకిషోర్, యాదల నరేష్, దండు శ్రీకాంత్, లక్ష్మణ్ గౌడ్, పాల్గొన్నారు.

కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో..

నిజామాబాద్‌నాగారం: 'తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం' ఆధ్వర్యంలో వినాయకనగర్‌లోని 'సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్' విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం సంఘం రాష్ట్ర సలహాదారులు పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తిని, ఆయన ఆశయాలను తీసుకొని, బహుజనులందరినీ ఐక్యం చేసి, దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. నాయకులు కోయెడి నర్సింహులు గౌడ్, పెద్ది సూరి గౌడ్, శ్రీరామ్ గౌడ్, కోయడి కిషన్ గౌడ్, శేఖర్ గౌడ్, శంకర్ గౌడ్, హైమద్, భీమాశంకర్, సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బీట్ ప్రారంభం



రెంజల్(బోధన్): కందకుర్తి, బోర్గాం గ్రామాల్లో మంగళవారం పొగాకు కొనుగోలు కేంద్రాల(బీట్)ను వీఎస్‌టీ(వజీర్ సుల్తాన్ టొబాకో) ఏరియా మేనేజర్ క్రిష్టారావ్, కంపెనీ ఉపాధ్యక్షుడు అజయ్‌లు ప్రారంభించారు. క్వింటా పొగాకుకు రూ.13,800 ధర ప్రకటించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతులకు పెట్టుబడులు పెరగడంతో ధరను గతంలో కంటే అధికంగా పెంచినట్లు వివరించారు. కందకుర్తిలో రైతు, నీలా విండో చైర్మన్ ఇమాంబేగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. బోర్గాంలో మాజీ సర్పంచ్ రమేష్‌తో కలిసి కంపెనీ ప్రతినిధులు ప్రారంభించారు. ఇతర కంపెనీలు అందించే మాయమాటలు నమ్మి రైతులు మోసపోవద్దని ఇమాంబేగ్ సూచించారు. గత 20 సంవత్సరాలుగా వీఎస్‌టీని నమ్ముకునే పొగాకును సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే భూపతిరెడ్డి



రూరల్ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

డిచ్‌పల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సుమారు 500 మంది మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, సీనియర్ నాయకులు కంచెట్టి గంగాదర్, పాలసాని శ్రీనివాస్, పెద్దోళ్ల శ్రీనివాస్, వాసుబాబు, శ్యాంసన్, ధర్మాగౌడ్, డాక్టర్ షాదుల్లా, పులి వెంకటేశ్వరరావు, అంతిరెడ్డి మోహన్‌రెడ్డి, న్యాస రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఇందల్వాయి: ఇందల్వాయి గ్రామానికి చెందిన పలువురు మున్నూరుకాపు సంఘ సభ్యులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లాకేంద్రంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. నవీన్ గౌడ్ తదితరులు ఉన్నారు.

నిజామాబాద రూరల్: మండలంలోని ఆకుల కొండూర్ గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ పూర్ణచందర్‌రావు ఆధ్వర్యంలో ఎంపీటీసీ సుదీర్‌కుమార్, పలువురు నాయకులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కంఠేశ్వర్ బైపాస్‌లోని రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు ఎమ్మెల్యేను సన్మానించారు. గూపన్‌పల్లి మాజీ సర్పంచ్ కుమారుడు దుడ్డు లింగం సైతం కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు కోర్వ రాజేంద్ర ప్రసాద్, జనార్ధన్ ఉన్నారు.

'లక్ష్యాన్ని చేరుకున్నాం'

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో వసూలు చేయాల్సిన ఆస్తి పన్ను లక్ష్యాన్ని చేరుకున్నామని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. డిమాండ్ రూ.5.7 కోట్లకు గాను సుమారు రూ.4.7 కోట్ల వరకు పన్ను వసూలు చేశామన్నారు. 80 శాతం పన్ను వసూలు చేసి జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నామన్నారు. ఆస్తి పన్నులు చెల్లించని వారు త్వరగా చెల్లించి ఆర్మూర్ పట్టణ అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

ఆకట్టుకున్న పోలీస్ కళాజాత



కమ్మర్‌పల్లి: బషీరాబాద్‌లో నిజామాబాద్ పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన పోలీస్ కళాజాత కార్యక్రమం గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. వివిధ అంశాలపై నాటక ప్రదర్శనతో ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఈతకు వెళితే జరిగే అనర్థాలు, హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే జరిగితే ప్రమాదాలు, డయల్ 100 వినియోగం, మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు, ఆన్‌లైన్‌లో జరిగే మోసాలను నాటిక ప్రదర్శనతో వివరించారు. ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ మాసం పవిత్రమైంది



సారంగాపూర్ గ్రామంలో భూపతిరెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

నిజామాబాద్ రూరల్: ముస్లింలకు రంజాన్ మాసం అత్యంత పవిత్రమైందని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి తెలిపారు. మండలంలోని సారంగాపూర్ గ్రామంలో మంగళవారం రాంనగర్ మాజీ సర్పంచ్ జిలాని ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలోని మైనారిటీలకు రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవాలని ముస్లిం మత పెద్దలు ప్రార్థనలు చేశారు. కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, డీసీసీబీ డెలికేట్ చంద్రశేఖర్‌గౌడ్, కోర్వ రాజేంద్ర ప్రసాద్, ఎల్లయ్య, అగ్గ బోజన్న, భగవంత్ రెడ్డి, జిల్లా పాల్గొన్నారు.

ఆటిజం జబ్బును నయం చేయవచ్చు



నిజామాబాద్‌నాగారం: చిన్నపిల్లల్లో తొలిదశలోనే ఆటిజం జబ్బును గుర్తిస్తే, వైద్యులను సంప్రదించి, మందులతో నయం చేయవచ్చని ఐఎంఏ ప్రధాన కార్యదర్శి కొట్టూరు శ్రీశైలం పేర్కొన్నారు. నగరంలోని ద్వారకానగర్‌లోని హెచ్‌పీఎస్ కిడ్స్ స్కూల్‌లో మంగళవారం ఆటిజం దినోత్సవం సందర్భంగా చిన్నపిల్లల్లో వచ్చే మానసిక రుగ్మతలపై ఆయన అవగాహన కల్పించారు. చిన్న పిల్లల్లో చాల మానసిక సమస్యలు ఉంటాయని, వాటిని ముందుగానే గుర్తిస్తే మందుల ద్వారా నయం చేయవచ్చన్నారు. వైద్యులు రాజేంద్ర ప్రసాద్, నేతి బాలెష్, నవీన్‌రెడ్డి, చతుర, ప్రిన్సిపల్ ప్రసన్నలక్ష్మీ, డైరెక్టర్ ప్రనయ్ పాల్గొన్నారు.

నేటి చిత్రం..



రోడ్డుపై గుంతలను పూడ్చరూ!

నగరంలోని ప్రగతినగర్ ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి, రోడ్డుపై గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

కమీషన్ల కోసమే కాళేశ్వరం





డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి.. సమావేశానికి హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

- బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రం అప్పులపాలు
- నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): కమీషన్ల కక్కుర్తి కోసమే ప్రాణహిత– చేవేళ్ల ప్రాజెక్టు డిజైన్లు మార్చి మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని కేఎన్ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జీవన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్‌ను ప్రజలు నమ్మితే అన్ని రకాలుగా మోసం చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. ఎంపీ అర్వింద్, మాజీ ఎంపీ కవిత నిజామాబాద్‌కు చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. పసుపు బోర్డు ఎక్కడ అంటూ ఎంపీని ప్రశ్నించారు. మెట్‌పల్లి, బోధన్‌తోపాటు సారంగాపూర్ సహకార చక్కెర ఫ్యాక్టరీని తెరిపించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఉపాధిహామీని ప్రోత్సహించడంతోపాటు వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని తెలిపారు. ఒక్క అవకాశమిచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని జీవన్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని 50వేలకు పైగా మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. బీఆర్ఎస్‌కు అభ్యర్థులు దొరకలేని పరిస్థితి ఉందని అందుకే ఎమ్మెల్యేగా ఓడిపోయిన బాజిరెడ్డి గోవర్ధన్‌ను బలవంతంగా ఎంపీ బరిలోకి దింపుతున్నారని పేర్కొన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, గడుగు గంగాధర్, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, ముప్పగంగారెడ్డి, గడిల రాములు, గోపాలం విద్యాసాగర్, అమృతాపూర్ గంగాధర్, కంచెట్టి గంగాధర్, నరాల రత్నాకర్, పాలసాని శ్రీనివాస్, వాసుబాబు, శ్యాంసన్, దర్మాగౌడ్, దేవ కరుణ, డాక్టర్ షాదుల్లా పాల్గొన్నారు.

సమాచారం..

4న విద్యుత్ ఫిర్యాదుల పరిష్కార వేదిక

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని తాడెం సబ్‌స్టేషన్‌లో ఈనెల 4న ఉదయం 10.30గం.ల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ ఉత్తమ్ జాడే ఒక ప్రకటనలో తెలిపారు. మోపాల్, బర్ధిపూర్, నిజామాబాద్ రూరల్, జక్రాన్‌పల్లి, సారంగాపూర్, పడకల్ సెక్షన్ పరిధిలోగల వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	69,700	వెండి (కిలో)	79,500
22 క్యారెట్స్	64,285		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	30	50	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	16	30
జిర్నెసుకాయ	30	60	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	30	50
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.45, 1.40, 4.35, 7.30, 10.25
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (తెలుగు) - 10.45, 1.50, 4.25, 10.25, ఓం భీమ్ బుష్ (తెలుగు) - 7.30
స్క్రీన్-3	ది గోట్ లైఫ్ (తెలుగు) - 1.15, 7.25, 10.40, కలియుగం పట్టణంలో (తెలుగు) - 4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.10, 1.10, 7.50, 10.50, ఓం భీమ్ బుష్ (తెలుగు) - 4.20
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు) - 12.00, 2.40, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-ఇంగ్లీష్) - 5.20, 8.00, 10.40
స్క్రీన్-3	ది గోట్ లైఫ్ (తెలుగు) - 12.05, 7.00, రజాకార్ (తెలుగు) - 3.45, ఓం భీమ్ బుష్ (తెలుగు) - 10.40
స్క్రీన్-4	క్రూ (తెలుగు) - 10.45, 1.35, 7.40, 10.30, ప్రేమలు (తెలుగు) - 4.25
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (తెలుగు)
లలితామహల్	ఓం భీమ్ బుష్ (తెలుగు)
విజయ్	రజాకార్ (తెలుగు)